# పెద్దల సబ్బాతుబడి పాఠములు

## పరలోకము మరియు భూమి ఐక్యపర్చబడెను

## ఫిలిప్పీయులకు మరియు కొలొస్సయులకు వ్రాసిన పత్రికలలో యేసును గూర్చి నేర్చుకొనుడి

### మొదటి త్రైమాసం-2026



**జనవరి, ఫిబ్రవరి, మార్చి -2026**


గ్రంథకర్త

**క్లింటన్ వాహ్ లెన్**

అనువాదం

**చింతా ప్రకాష్**

9వ పాఠం ఫిబ్రవరి 21-27

# దేవుడు మనలను అంగీకరించి మనకు నిరీక్షణ కలుగచేయును

## సబ్బాతు మధ్యాహ్నము : ఫిబ్రవరి 21

**ఈ వారమునకు చదువ వలసిన వచనములు : కొలొస్సయి 1:21,22; 1:23; కొలొస్స 1:24,25; కొలొస్సయి 1:26,27.**

**కంఠతవచనం : "ఎందుకనగా మనమాయనయందు దేవుని నీతి అగునట్లు పాపమెరుగని ఆయనను మన కోసము పాపముగా చేసెను" (2కొరింథి 5:21).**

గతవారం సబ్బాతుబడి పాఠములో మనము చూచినట్లు దేవుడు మనలను ఏవిధముగా అంగీకరిస్తాడో పౌలు మాట్లాడెను (కొలొస్సయి 1:20) యేసు మనకు చేసిన సమస్తమును బట్టి దేవుడు మనలను అంగీకరిస్తున్నాడు. (8వ పాఠం గురువారం భాగమును చదువుడి) ఈ అంశమును గురించి పౌలు కొలొస్సయులకు వ్రాసిన పత్రిక ద్వారా ఏమి చెప్పుచున్నాడో అనే విషయమును ఈ వారం చదువుదాము.

దేవుడు మనలను తిరిగి అంగీకరించుటకు సిలువ మీద యేసు పొందిన మరణము సహాయపడింది. పాపము మనలను దేవుని నుండి వేరు చేస్తుంది. అయితే ఇప్పుడు దేవుని కుమారుడైన యేసును మనము నమ్ముచున్నాము. కాబట్టి దేవుడు మనలను అంగీకరిస్తున్నాడు.

ఈ వారమునకు ఏర్పాటు చేయబడిన మన కంఠతవచనము 2కొరింథి 5:21. యేసు మన పాపముల కొరకు మరణించెను గనుక దేవుడు మనలను అంగీకరిస్తున్నాడు. అదే బైబిలు సత్యమును ఈ వాక్యము కూడా బోధించుచున్నది. దేవుని యొక్క ప్రేమకు సిలువ ఒక శక్తివంతమైన చిహ్నము. యేసును గూర్చిన శుభవార్తను విని ఆయనను అంగీకరించినపుడు దేవుని యొక్క ప్రేమ మనుష్యుల జీవితములను మార్చి వేయునని మనకు సిలువ చూపుతుంది. నిత్యజీవము దొరుకుననే నిరీక్షణను యేసు మనకు ఇచ్చుచున్నాడు.

దేవుడు మరుగుచేసిన మర్మమును గూర్చి (కొలొస్సయి 1:26) కూడా పౌలు మాట్లాడుచున్నాడు. ఈ మర్మము ఏమిటి? మరుగు చేయబడిన దానిలో ఇంకా ఏమి ఉన్నది? యేసును గూర్చిన శుభవార్తతో ఈ మర్మము ఏవిధముగా జత చేయబడినది? ఈ ప్రశ్నలన్నింటికి జవాబును ఈ వారం మనము చదువుకొనబోవుచున్నాము.

– ఫిబ్రవరి 28, సబ్బాతు దినమున ఈ వారమునకు ఏర్పాటు చేయబడిన సబ్బాతుబడి పాఠమును అధ్యయనము చేయుటకు సిద్ధపడుడి.

## ఆదివారం ఫిబ్రవరి 22

### పాపము నుండి రక్షింపబడుట (కొలొస్సయి 1:21,22)

**కొలొస్సయి 1:21,22 చదువుడి. ఈ వాక్యాలలో పౌలు ఏమి చెప్పుచున్నాడు? దేవుని నుండి వేరుపడి పోవుటను గూర్చి మనము ఆయనకు శత్రువులుగా ఉండుటను**

**గూర్చి పౌలు మాట్లాడేటప్పుడు ఆయన భావము ఏమిటి? ఈ విషయాలన్నింటిని యేసు మరణము ఏవిధంగా మార్చివేసెను? జవాబు కొరకు ఎఫెసి 5:27 చదువుడి.**

రెండు వేల సం॥ల క్రిందట పౌలు జీవించెను. ఈ పత్రికలు వ్రాసెను. మనుష్యుల హృదయములలో దేవుని ప్రేమ లేనియెడల వారు దుర్మార్గముగా ప్రవర్తిస్తారని పౌలు అర్థము చేసుకున్నాడు. 2 వేల సం॥ల తరువాత పౌలుతో ఎవరు వాదించగలరు? ఒకే ఒక క్రైస్తవ బోధను అంగీకరించుటకు ఎవ్వరికిని విశ్వాసము అక్కరలేదని ఒకరెవరో చెప్పారు. ఆ బోధ ఏమిటంటే "మానవులందరూ పాపులు" అనే విషయాన్ని అంగీరించుటకు విశ్వాసము అక్కర లేదు. అది నిరూపించుటకు సాయంకాల వార్త ప్రసారాలను చూస్తే తెలిసిపోతుంది. అవునా?

మనము చెడిపోయిన వారమైయుండగా దేవుడు మనలను రక్షించుటకు పరిపూర్ణమైన ప్రణాళికను వేసెను. అయితే పాపము యొక్క సమస్యను తీర్చుటకు యేసు మరణించవలెను" అనెడిది ఏకైక మార్గము.

ఏదెనులో ఆదాము పాపము చేసిన తరువాత ఆదామవ్వలను చూచుటకు ప్రభువు వెళ్ళెను. వారు పాపము చేసి దేవుని నుండి తప్పించుకొనుటకు ఒక చోట దాగుకొనిరి. ప్రభువు ఆదామును ఎక్కడున్నావు? అని పిలిచెను. (ఆదికాం. 3:9) నేడు దేవుడు మన కొరకు కూడా వెదుకుచూ ఉన్నాడు. మనమందరము తప్పిపోయిన గొఱ్ఱెల వంటి వారము. దేవుడు తప్పిపోయిన తన ప్రతి గొఱ్ఱె కొరకు వెదకుచున్నాడు. ఒక్కొక్క గొఱ్ఱె కొరకు ఆయన వెదకుచున్నాడు. ఆదికాండము 3:15లో దేవుని యొక్క రక్షణ ప్రణాళికను మనము చూడగలము. యేసును గూర్చిన శుభవార్తకు సంబంధించిన వాగ్దానమును ఈ వాక్యము మనకు చూపిస్తున్నది.

యేసును గూర్చిన శుభవార్తలో సామాన్యమైన మూడు భాగాలున్నవి. ఈ మూడు భాగాలను సుళువుగానే గ్రహించగలుగుదుము.

**భాగము -1 :** మనము నిస్సహాయకులమైన పాపులము. పాపులుగా మనంతట మనము రక్షించుకొనలేము. అందుచేత యేసు మన కొరకు చనిపోవుటకు వచ్చెను (రోమా 5:6-8 చదువుడి)

**భాగము -2 :** మన పాపములనిమిత్తము యేసు మరణించెను అనే విషయాన్ని మనము అంగీకరించాలి. అటు తరువాత మన పాపాలను ఒప్పుకొని బాప్తిస్మము తీసుకొనవలెను. ఈ విషయాలను చేసినప్పుడు యేసు మనలను క్షమిస్తాడు. పాపపు నేరమునుండి పవిత్రులనుగా చేయును (రోమా 5:9-11; రోమా 6:6,7 చదువుడి).

**భాగము -3 :** యేసు మనలను రక్షించిన తరువాత మనము జీవించుచున్న ఈ జీవితము ఆయన యొక్క ప్రభావము వలననే జీవిస్తున్నాము. ఆయనతో మన జీవితాలు జత చేయుచున్నాము. ఆయన మనలను మార్చివేసి మనకు నూతన హృదయాలను అనుగ్రహించును. అప్పుడు ఆయన జీవితాన్ని మనలో జీవిస్తాడు (2కొరింథి 5:17-21 మరియు గలతీ 2:20 చూడుడి).

ఒక్కసారే ఈ మూడు భాగాలు సంభవించవచ్చును. అవి వేర్వేరు సమయాలలో సంభవించవచ్చును. ఒక్కొక్కరి అనుభవము ఒక్కొక్క విధంగా ఉంటుంది. అయితే ఒక్క విషయము మాత్రము అందరికి సమానముగా ఉంటుంది. యేసును అంగీకరించుటకు మనము సంసిద్ధముగా ఉండాలి. ప్రతి ఉదయము మన జీవితాలను యేసుకు సమర్పించినపుడు ఈ మూడు భాగాలను మనము చేయవచ్చును. ఇక్కడ ముఖ్య విషయమేమంటే యేసు మరణించెను గనుక మనము రక్షింపబడితిమనే విషయాన్ని ఎల్లప్పుడు జ్ఞాపకముంచుకొనవలెను.

## సోమవారం ఫిబ్రవరి 23

## మీరు ఎడతెగక నమ్మిన యెడల (కొలొ 1:23)

**కొలొస్సయి 1:23 చదువుడి. కొలొస్సయులో ఉన్న సంఘమునకు ఈ వాక్యములో పౌలు వ్రాసిన ప్రోత్సాహకరమైన మాటలేమిటి? ఆ విశ్వాసులకు ఈ మాటలు ఏవిధంగా నిరీక్షణను కలుగజేసెను? (కొలొస్స 2:5 మరియు ఎఫెసి 3:17 చదువుడి)**

కొలొస్సయులను ఎడతెగక నమ్మమని పౌలు ప్రోత్సహించెను. వారు కనుపరచిన విశ్వాసము యొక్క రుజువును పౌలు అప్పటికే చూచాడు. వారి విశ్వాసము చాలా బలమైనదిగాను, భక్తి గలదినైయున్నదని పౌలుకు తెలుసు (కొలొస్స 2:5) అదే సమయములో వారి యొక్క నిరీక్షణ ఎడతెగక నమ్ముట మీద ఆధారపడియున్నది. వారి విశ్వాసము బలముగా ఉండుటయే గాక దానిలో వారు నిరంతరము ఎదగవలెను.

కొలొస్స 1:23లో "నిలిచియుండు" అనే పదము విడిచి పెట్టకుండా అనే భావము కలిగియున్నది. యూదుల ఆధ్యాత్మిక నాయకులు, ఏడవ ఆజ్ఞ మీరి మోసము చేసిన స్త్రీని యేసునొద్దకు తీసుకొని వచ్చి మాట్లాడిన సందర్భములో కూడా బైబిలు ఇదే పదమును ఉపయోగించెను. "ఈ స్త్రీని మేము ఏమి చేయవలెనని" యూదయ నాయకులు ఎడతెగక యేసును అడుగుచున్నారు. (యోహాను 8:7) పేతురు చెరసాల నుండి తప్పించుకొని వెళ్ళినప్పుడు కూడా బైబిలు ఈ పదమును ఉపయోగించెను. రొదే అనే బాలిక ద్వారమును మూసి వేయగా పేతురు ఇంకను తలుపు తట్టుచూనే ఉన్నాడు. పేతురు ద్వారము యొద్ద ఉన్నాడని గదిలోపల ఉన్న వారికి తెలియజేయుటకు రొదే పరుగెత్తి వెళ్ళెను. (అపొ.కా. 12:16) బైబిలు సత్యమును నమ్ముచూ ఉండమని తిమోతిని ప్రోత్సహించినపుడు కూడా పౌలు ఇదే మాటను ఉపయోగించెను (1తిమోతి 4:16) కొలొస్స 1:23లో పౌలు విశ్వాసులను ప్రోత్సహిస్తూ దేవునిని నమ్మమని చెప్పెను.

మనము రాబోయే వారములో చూడనైయున్న విధముగా, పౌలు విశ్వాసులను ప్రోత్సహిస్తూ దేవునిని నమ్మమని చెప్పెను.. తప్పుడు భావాలను కొలొస్సయులు అంగీకరించవద్దని పౌలు కోరుచున్నాడు. (కొలొస్సయు 2:8; 20-22 చదువుడి)

కొలొస్సయులు విశ్వాసములో బలముగా ఎదగాలని దేవుని వాక్యమైన బైబిలు యెడల వారికున్న ప్రేమలోను బలముగా ఎదగాలని పౌలు కోరుచున్నాడు (మత్తయి 7:25; ఎఫెసి 2:20; ఎఫెసి 3:17). కదిలింపబడుటకు వీలు లేనట్టి గోడవలెను, భవనము వలెను కొలొస్సయులు ఉండాలని పౌలు కోరుచున్నాడు. అప్పుడు మాత్రమే శుభవార్త యందున్న వారి నిరీక్షణ బలముగా నిలిచియుండును (1కొరింథి 15:58)లో కూడా పౌలు ఇదే భావముతో మాట్లాడెను. 'కాగా నా ప్రియ సహోదరులారా, మీ ప్రయాసము ప్రభువునందు వ్యర్థము కాదని యెరిగి, స్థిరులును కదలనివారును, ప్రభువు కార్యాభివృద్ధియందు ఎప్పటికిని ఆసక్తులైయుండుడి" (1కొరింథి 15:58).

**విశ్వాసమునందు బలముగా నిలిచియుండే విషయములో నీ అనుభవము ఏవిధముగా ఉన్నది? ఎడతెగక బలముగా నిలిచియుండాలనే తీర్మానమును తీసుకొనుట ఎందువలన చాలా ప్రాముఖ్యము. అటువంటి నిర్ణయమును నీవు తీసుకొనని యెడల ఏమి సంభవించును?**

**మంగళవారం** **ఫిబ్రవరి 24**

## దేవుని యొక్క శాశ్వతమైన ప్రణాళిక (కొలొస్సయి 1:24,25)

**కొలొస్సయి 1:24,25 చదువుడి. యేసు కొరకు పౌలు అనుభవించిన శ్రమలను గూర్చి ఈ వాక్యాలలో ఏమి చెప్పుచున్నాడు?**

రోమునందు ఒక గృహములో పౌలు బంధింపబడియున్నపుడు ఈ పత్రికను కొలొస్సయులో ఉన్న క్రైస్తవ సంఘమునకు వ్రాసెను. అవును నిజముగా పౌలు ఆ సమయములో చాలా శ్రమలను ఎదుర్కొనెను. చెరసాలలో బంధింపబడిన మనిషిగా గత కాలమువలె వేర్వేరు ప్రాంతములకు ప్రయాణించి శుభవార్తను బోధించలేకపోవుచుండెను. (అపొ.కా. 20:20) చెరసాలలో బంధింపబడియున్నదానికన్నా యేసుకు సంబంధించిన శుభవార్తను ప్రకటించలేకపోవుచ్చున్నాననే బాధ పౌలును ఎక్కువ శ్రమకు గురి చేసి యుండవచ్చును. విశ్వాసమును బట్టి వారు శ్రమలను ఎదుర్కొనవలసి వచ్చును అని యేసు ఆయనను వెంబడించిన వారిని హెచ్చరించెను (మత్తయి 24:9; యోహాను 16:33). మన కొరకు పరలోకములో దేవుడు వాగ్దానము చేసిన దీవెనలతో పోల్చుకుంటె మనకు ఎదురయ్యే శ్రమలు ఏపాటివి? అనే విషయములో పౌలు ఈలాగు చెప్పెను. "మన యెడల ప్రత్యక్షము కాబోవు మహిమ యెదుట ఇప్పటి కాలపు శ్రమలు ఎన్నతగినవి కాదని యెంచుచున్నాను" (రోమా 8:18). అందుచేత పౌలు తాను ఎదుర్కొనుచున్న శ్రమలను బట్టి ఆనందించుచున్నానని కొలొస్సయులకు తెలియపర్చెను. పౌలు శ్రమలను అంగీకరించుటవలన సంఘమునకు దీవెనకరముగా మారునని ఆయనకు తెలుసు (కొలొస్స 1:24).

అవును పౌలు చెరసాలలో బంధీగా ఉన్నాడు. అయితే 'ఏ ఒక్కరు కూడా దేవుని వర్తమానమును చెరసాలలో బంధించియుంచలేరు" (2తిమోతి 2:9) పౌలు చెరసాలలో

ఉన్నపుడు ఆయన ఫిలిప్పీయులకు, ఎఫెసీయులకు, ఫిలోమోనుకు పత్రికలు వ్రాసెను. చెరసాల నుండి విడుదలైనపుడు చివరిసారి 2తిమోతి పత్రికను వ్రాసెను. క్లుప్తముగా చెప్పాలంటే పౌలు చెరసాలలో గడిపిన కాలమంతయు సంఘమునకు దీవెనకరముగా మారింది. బంధీగా ఉన్నపుడు నూతన నిబంధనలోని అధిక భాగమును వ్రాసెను. అదే సమయములో హెబ్రీపత్రికను కూడా వ్రాసి యుంటాడు.

మనలను రక్షించాలనెడి దేవుని యొక్క శాశ్వత ప్రణాళికలో పౌలు యొక్క అనుభవము మరియు ఇంకా అనేక విషయాలు ఇమిడియున్నవి. దేవుని కొరకు పౌలు పరిచర్య, యేసు అనుచరుల పరిచర్యలు కూడా దేవుని ప్రణాళికలో భాగములే. అదేవిధముగా పాతనిబంధన కాలములో మోషే పరిచర్య మరియు ప్రత్యేక వర్తమానికులు దేవుని కొరకు చేసిన పరిచర్య కూడా రక్షణ ప్రణాళికలో భాగములే. వారి పరిచర్యలో భాగముగా వారు చేసిన పని ఏమిటంటే దేవుని యొక్క సంపూర్ణ వర్తమానమును బోధించుటయైయున్నది (కొలొస్సయులకు 1:25).

దేవుని ప్రణాళికను గూర్చి రేపటి పాఠములో మరింత ఎక్కువ తెలుసుకుంటాము. పెద్ద ప్రణాళికలో పౌలు యొక్క పని చిన్న భాగము మాత్రమేయని పౌలుకు తెలిసినట్లు గ్రహించాలి. ఆకాశము మరియు భూమి నిర్మించకముందే దేవుడు ఈ ప్రణాళిక ఆరంభించెను (మత్తయి 13:35, ఎఫెసి 1:14)

**నీ సొంత జీవితమును గూర్చి ఆలోచించు. నీవు తీసుకొనే తీర్మానములు మనలను రక్షించాలని దేవుని ప్రణాళికలో ఏవిధముగా అమరును? తీసుకునే నిర్ణయము నిజముగా 'చిన్నదని' తెలుసుకొనగలమా? తీసుకునే చిన్న నిర్ణయము పెద్ద నిర్ణయమని కాలము గడిచిపోయిన తరువాత ఏవిధముగా అర్థము చేసుకోగలుగుదుము?**

**బుధవారం** **ఫిబ్రవరి 25**

## దేవుని యొక్క మర్మము (కొలొస్సయి 1:26,27)

**కొలొస్సయి 1:26,27 చదువుడి. ఈ వచనములలో దేవుని యొక్క మర్మమును గూర్చి పౌలు మాట్లాడుచున్నాడు. ఆ మర్మము ఏమిటి?**

1కొరింథీ 2:7లో కూడా దేవుని యొక్క మర్మమును గూర్చి పౌలు మాట్లాడుచున్నాడు. "దేవుని జ్ఞానము మర్మమైనట్లుగా బోధించుచున్నాము. ఈ జ్ఞానము మరుగైయుండెను. జగదుత్పత్తికి ముందుగానే దీనిని దేవుడు మన మహిమ నిమిత్తము నియమించెను" (1కొరింథీ 2:7). మనలను రక్షించుటకు దేవుని ప్రణాళిక ఆయన మర్మము. ఈ బైబిలు సత్యమును గూర్చి పేతురు కూడా మాట్లాడాడు. "పరలోకమునుండి పంపబడిన పరిశుద్ధాత్మ వలన మీకు సువార్త ప్రకటించిన వారి ద్వారా మీకిప్పుడు తెలుపబడిన యీ సంగతుల

విషయమై, తమ కొరకు కాదు గాని మీ కొరకే తాము పరిచర్య చేసిరను సంగతి వారికి బయలుపరచబడెను. దేవదూతలు ఈ కార్యములను తొంగిచూడగోరుచున్నారు" (1పేతురు 1:12). యేసును గూర్చిన శుభవార్తను పౌలు తన వర్తమానముగా బోధించుచున్నాడు. "ప్రభువును గూర్చిన ఆ వర్తమానము అనాది నుండి రహస్యముగా ఉంచబడెను" (రోమా 16:25). అయితే ఈ మర్మమును లేక ఈ రహస్యమును మనము అర్ధము చేసుకొనుటకు యేసు సహాయము చేయును (2కొరింథీ 3:14).

**దేవుని యొక్క మర్మమును గురించి ఈ క్రింద ఇవ్వబడిన వాక్యములను చదువుడి. మనలను రక్షించుటకు దేవునికున్న ప్రణాళికను అర్ధము చేసుకొనుటకు ఈ వాక్యములు ఎట్లు సహాయపడును?**

1. ఎఫెసి 1:7-10 ............................................................
2. ఎఫెసి 3:3-6 ..............................................................

చివరిగా పరలోకములోను మరియు భూమి మీద ఉన్న సర్వమును యేసు జత చేయును. అంతట సమస్తము ఆయనలో పరిపూర్ణమగును. సమాధానమును నెలకొల్పుటకు దేవుడు, యేసు, పరిశుద్ధాత్మ కలిసి పనిచేసినట్లు క్రైస్తవ సంఘము కూడా కలిసి పనిచేయవలెనని యేసు ప్రార్ధించెను (యోహాను 17) అయితే క్రైస్తవ సంఘములో ఈ సమాధానమును దేవుడు ఏవిధముగా తీసుకొని వస్తాడో అనే విషయము యేసు మరణించే వరకు ఎవ్వరూ గ్రహించలేకపోయిరి.

దేవుడు మన కొరకు యేసును అనుగ్రహించునంతగా మనలను ఆయన ఎందుకు ప్రేమించెను? పరలోకమునకు వెళ్ళునప్పుడు మనలను రక్షించుటకు దేవుని ప్రణాళికను గూర్చి చదువుకుంటాము. మన అధ్యయనము శాశ్వతకాలము కొనసాగును. అంతవరకు "మానవులందరి పక్షమున యేసు మరణించెను" అనే విషయాన్ని గ్రహించగలము. మనమిప్పుడు జీవించుచుండగా మనలను మనము సంతోషపెట్టుకొనుటకు జీవించబోవుట లేదు. దానికి బదులుగా క్రీస్తును సంతోషపెట్టుటకు జీవించాలి. తిరిగి జీవించుటకు మృతులలో నుండి యేసును లేపిన వాడు దేవుడు (2కొరింథీ 5:15). ఎవరైతే యేసునందు నమ్మకముంచుదురో వారు దేవుడు మనకు చేసిన వాగ్దానములను పంచుకుంటారు. యేసును గూర్చి యూదులకు, యూదులుకాని అన్యజనులకు దేవుడు చేసిన వాగ్దానములను నెరవేర్చును. వీరందరికి సంఘమునే దేహముగా దేవుడు జతచేస్తాడు.

**పౌలు చెప్పాడు "క్రీస్తు నీలో జీవిస్తాడని" (కొలొస్స 1:27) ఏవిధముగా మనలో జీవిస్తాడు? యేసునందు విశ్వాసముంటే ఆయన మన హృదయంలో జీవిస్తాడు.**

గురువారం ఫిబ్రవరి 26

## దేని నిమిత్తము ప్రపంచవ్యాప్తముగా పోరాటము జరుగుచుండెను

**(కొలొస్సయులకు 1:28,29)**

**కొలొస్స 1:28,29 చదువుడి. ఈ వాక్యాలలో పౌలు ఏమి మాట్లాడుచున్నాడు?**

యేసు సిలువ మీద ఆయన పొందిన మరణము అనే విషయము మీద పౌలు బోధించెను (1కొరింథి 1:23). మనలను రక్షించుట కొరకు యేసు ఎందుకు మరణించవలసి వచ్చెనో ఎఫెసి 5:27 వివరిస్తుంది. "అటువలె క్రీస్తు కూడా సంఘమును ప్రేమించి, అది కళంకమైనను, ముడతయైనను అట్టిది మరి ఏదైనను లేక పరిశుద్ధమైనది గాను, నిర్దోషమైనదిగాను మహిమగల సంఘముగాను ఆయన తన యెదుట దానిని నిలువబెట్టుకొనవలెనని వాక్యముతో ఉదక స్నానము చేత దానిని పవిత్రపరచి, పరిశుద్ధ పరచుటకై దాని కొరకు తన్ను తాను అప్పగించుకొనెను" (ఎఫెసి 5:27) పౌలు తన బోధ ద్వారా "ప్రతి మనుష్యుని సంపూర్ణునిగా చేసి ఆయన యెదుట నిలువబెట్టవలెనని" కోరియున్నాడు (కొలొస్స 1:28). పౌలు బోధించుటయే గాక వారిని హెచ్చరించెను. ఆయన బైబిలు సత్యమును ఏవిధముగా జీవించాలో నేర్పించెను. (2థెస్సలో 2:15; 1తిమోతి 4:11; 1తిమోతి 5:7; తీతు 1:9). యేసును గనుక క్రైస్తవులు తిరస్కరించిన యెడల ఎటువంటి చెడు విషయాలు సంభవిస్తాయో వారికి పౌలు హెచ్చరించెను. అబద్ద బోధకుల వలన ఎదురయ్యే ప్రమాదాలను గూర్చి కూడా పౌలు హెచ్చరించెను. (అపొ.కా. 20:29-31; రోమా 16:17).

మనము బైబిలు బోధలను, అందులో పేర్కొనబడిన హెచ్చరికలను అంగీకరించినప్పుడు క్రైస్తవులుగా ఎదుగుదుము. యేసునందు ఎదుగుట అనే భావము చాలా ప్రాముఖ్యమైనది. తల్లిదండ్రులు వారి పిల్లల మొదటి మాటలు, నడుచుటకు పిల్లలు వేసే మొదటి అడుగుల విషయములో ఆనందిస్తారు. పిల్లలు చదువుట నేర్చుకున్నపుడు సంతోషిస్తారు. అయితే అనేక సం॥లు గడిచిన తర్వాత పిల్లలు మాట్లాడకపోయినా నడవలేకపోయినా తల్లిదండ్రులు ఏమి చేస్తారు? వేదనకు గురవుతారు, అవునా? ఎదుగుట అనునది జీవితములో ఒక భాగమైయున్నది.

కొలొస్సయి 1:28లో 'కంప్లీట్' సంపూర్ణునిగా చేసెను అనే పదమునకు గ్రీకు భాషలో 'టెలియోస్: టెలియోస్ అనగా సంపూర్ణమైన లేక ఏవిధంగానూ చెడిపోయింది కాదు అనే అర్థమునిస్తున్నది. మనము విశ్వాసములో ఎదుగుచుండగా దేవుని ధర్మశాస్త్రమును గూర్చి మనలను ఏమి చేయమని కోరుచున్నదో అనే విషయాలను ఎక్కువగా అర్థము చేసుకొనగలుగుదుము (కీర్తన 119:96) దేవుని యొక్క ధర్మశాస్త్రము మన హృదయములో ఉన్న భావములను, అనుభవములను బట్టి తీర్పు తీర్చును (హెబ్రీ 4:12).

అయితే మనము కొంచెము జాగ్రత్త వహించాలి. అందుచేతనే పౌలు "హెచ్చరిక" అనే మాటను కొలొస్సయి 1:28లో వాడెను "ఒకని యెదుట సరియైనదిగా కనబడు మార్గము కలదు. అయితే తుదకు అది మరణమునకు త్రోసివేయును" (సామెత 14:12) మనము బైబిలు చదివినపుడు పరిశుద్ధాత్మ జ్ఞానమును కలుగజేయును. అబద్ద బోధలలో కూడా కొంత సత్యముంటుంది. అయితే ఈ అబద్ద బోధలు బైబిలు బోధించే సత్యములోనుండి కొంత తీసివేయడమో లేక కలపటమో సంభవిస్తూ ఉంటుంది. (యెషయా 8:20) అట్టి సందర్భాలలో బైబిలు ఏమి చెప్పుతుందో సమయానికదివర్తిస్తుందా అని బైబిలునే ప్రశ్నించవచ్చు. అందుకే బైబిలు చదివేటపుడు జ్ఞానముతో చదవాలి. అంతేకాక ఏది సత్యమో, ఏవి అబద్దమో తెలుసుకొనగలుగుదుము.

**శుక్రవారం** **ఫిబ్రవరి 27**

## అదనపు అధ్యయనము

మన హృదయములలో పరిశుద్ధాత్మ ఏమాత్రమును లేదు. మనము దేవుని ధర్మశాస్త్రమును గైకొనలేము. అయితే మనలను రక్షించుటకు యేసు ఒక మార్గమును ఏర్పాటు చేసెను. నీ అంతట నీవు ఆయనకు సమర్పించుకోవాలి. నీ రక్షకునిగా ఆయనను నీవు అంగీకరించాలి. నీ గత జీవితము పాపముతో నిండి యుండవచ్చును. అయితే యేసును బట్టి దేవుడు నిన్ను పవిత్రునిగా అంగీకరిస్తాడు. దేవుడు మనలను చూచినప్పుడు ఆయన కేవలం యేసు యొక్క పరిశుద్ధ జీవితమునే చూస్తాడు. మనము ఎన్నడూ పాపము చేయనివారముగా దేవుడు మనలను అంగీకరిస్తాడు.

"అయితే మనము తెలుసుకొనవలసింది ఇంకా చాలా ఉన్నది. యేసు హృదయమును మార్చివేయును. యేసునందు మనకు విశ్వాసమున్న యెడల ఆయన మన హృదయములో జీవిస్తాడు. యేసుతో మనకు సంబంధము కలిగియుండునట్లు విశ్వాసమునకు సహాయము చేయును. మనము మన హృదయాలను నిరంతరము ఆయనకు అప్పగించుకొనవలెను. ఆయనను సేవించుటకు నిర్ణయించుకొనినంత కాలము దేవునికి ఇష్టమైన పనులను మనము చేయుటకు యేసు మనలో పనిచేయును.

అందుచేత మనము డంబములు పలుకుట గాని లేక మన హృదయములను గర్వముతో నింపుకొనుటకు మనకు ఎటువంటి కారణములేదు. మన నిరీక్షణకు యేసు ఒక్కడే కారణము. యేసు యొక్క పరిశుద్ధ జీవితమే ఆయన మనకిచ్చు బహుమానము. అది మన హృదయములను పవిత్రము చేయును. అంతట మనలను పవిత్రులనుగా చేయుటకు ఆయన ఆత్మ మనలో పనిచేయును – ఎలెన్ జి వైట్, క్రీస్తు యొద్దకు మెట్లు, పుటలు 62, 63.

అనేకమంది సంఘమును విడిచి వెళ్ళిపోదురని దేవుడు ఒక శక్తివంతమైన రీతిలో నాకు చూపించెను. వారు దురాత్మలకు విధేయులై వారి బోధలను అంగీకరిస్తారు. ప్రతి వ్యక్తి కూడా సత్యమనగా ఏమిటో అర్ధము చేసుకొనుటకు బైబిలు సత్యమును నమ్మవలెనని ప్రభువు కోరుచున్నాడు – ఎలెన్ జి వైట్, సువార్త పరిచర్య, పుట 363.

## చర్చించుకొనుటకు ప్రశ్నలు

1. కంఠతవచనమును మరొకసారి చదువుడి. ఆ వాక్యము యొక్క భావమేమిటి? మన కొరకు యేసును పాపముగా చేసెను. అనగా అర్థమేమిటి? సిలువ మీద యేసు యొక్క మరణమును మనకు మారుగా మరణించెను అని అర్ధము చేసుకొనుటకు ఈ భావము మనకు ఏవిధముగా సహాయపడును? యేసును బట్టి దేవుడు మనలను అంగీకరిస్తాడు. అనగా దాని అర్ధమేమిటి?
2. “ఒక్కసారి రక్షింపబడితే, ఎల్లప్పుడు రక్షింపబడినట్లే” అనే భావమును అనేకమంది క్రైస్తవులు నమ్మారు. అనగా దీని అర్ధము ఒక్కసారి క్రైస్తవులు యేసును అంగీకరించిన యెడల ఇక ఎన్నటికి తప్పిపోరు అని ఈ బోధ యొక్క అర్ధము. ఈ భావము ఎందువలన తప్పు? ఈ భావమును నమ్మే క్రైస్తవులను ఈ అబద్ద బోధ ఏవిధముగా ప్రమాదములోనికి నడిపించును? ఈ అబద్ద బోధను మనము తప్పనిసరిగా తిరస్కరించవలెను. అదే సమయములో మనము రక్షింపబడితిమి అనే నిరీక్షణను ఏవిధముగా పొందగలము?
3. నీ విశ్వాసము ఎంత బలముగా ఉన్నది (కొలొస్స 1:23 చదువుడి)? నీవేమి నమ్ముచున్నావో అనే విషయము నీకు ఎంత బాగుగా తెలుసు? దానిని ఎందుచేత నీవు నమ్ముచున్నావు? నీవేమి నమ్ముచున్నావో బాగుగా తెలుసుకొనుటకు నీవేమి చేయగలవు? నీ విశ్వాసములో నీవు బలముగా ఉండుట ఎందువలన చాలా ప్రాముఖ్యము?

❋✶❋